క్లుప్తంగా

గర్భిణులకు వైద్య పరీక్షలు

మానవపాడు: మండలంలోని జల్లాపురం గ్రామంలో ఆరోగ్య ఉపకేంద్రంలో డాక్టర్ యాకుబ్‌బాషా ఆధ్వర్యంలో గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని జల్లాపురం, చండూరు, బోరవెల్లి, పల్లెపాడు గ్రామాల్లోని 3నెలల నుంచి 9 నెలల గర్భిణులకు వైద్యపరీక్షలు నిర్వహించామని తెలిపారు. బాలింతలు మంచి పౌష్టికాహారం తీసుకోవాలని పేర్కొన్నారు. బీపీ, షుగర్, థైరాయిడ్ వ్యాధులపై పరీక్షలు చేశామన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ చంద్రన్న, ఆశలు, గర్భిణులు, సిబ్బంది పాల్గొన్నారు.

రెండోరోజూ నిరసన దీక్షలు

గద్వాల క్రైం: గద్వాల జిల్లా కోర్టు సముదాయాలను పీజేపీ క్యాంపు ప్రభుత్వ స్థలంలోనే స్థలం కేటాయించాలని గద్వాల బార్ అసోషియేషన్ సభ్యులు గద్వాల కోర్టు బయట చేపట్టిన నిరసన దీక్షలు రెండో రోజు కొనసాగాయి. వారికి మద్దతుగా అన్ని పార్టీల నాయకులు సంఘీభావం తెలిపారు. దీక్షలో రాఘురామిరెడ్డి, వెంకటాద్రిరెడ్డి, రమేష్, విజయ్‌కుమార్, మురళి, ఆయా పార్టీల నాయకులు, తదితరులు ఉన్నారు.

క్రిస్మస్ సందర్భంగా వాలీబాల్ పోటీలు

గట్టు: మండలంలోని మాచర్లలో క్రిస్మస్ పండుగ సందర్భంగా ఈ నెల 25,26,27 తేదీల్లో ఓపెన్ టూ ఆల్ వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మెథడిస్ట్ చర్చి గ్రౌండ్‌లో వాలీబాల్ పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మొదటి బహుమతి రూ.20,016, ద్వితీయ బహుమతి రూ.10,016. తృతీయ బహుమతి రూ.5016లు అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు 6304353796, 8919108811లకు సంప్రదించాలని నిర్వాహకులు కోరారు.

ఇద్దరు అదృశ్యం


పవన్‌కుమార్ (ఫైల్)

కేటీదొడ్డి: బాలుడు అదృశ్యమైన సంఘటన మండలంలోని కొండాపురంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. కొండాపురానికి చెందిన వడ్డె నర్సింహులు, లక్ష్మీ దంపతుల కుమారుడు పవన్‌కుమార్ గ్రామంలోని పాఠశాలలో రెండో తరగతి చదువుతున్నాడు. ఉదయం పాఠశాలకు వెళ్లాడు. సాయంత్రం అయినా ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు బంధువులు, కుటుంబ సభ్యులు వద్ద వెతికినా ఆచూకీ తెలియలేదు. తండ్రి వడ్డె నర్సింహులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. అయితే అదృశ్యమైన బాలుడు వరుసకు బాబాయి అయిన గోవిందు అనే వ్యక్తి బైక్‌పై ఇద్దరు వెళ్తున్న సమయంలో గ్రామస్తులు చూసినట్లు తెలిపారు. బాలుడు అదృశ్యమయ్యాడా? లేక ఇద్దరు కలిసి ఎక్కడికైనా వెళ్లారా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కట్టెల ట్రాక్టర్ పట్టివేత

కేటీదొడ్డి: అనుమతి లేకుండా తరలిస్తున్న కట్టెల ట్రాక్టర్‌ను ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ మన్యం పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గద్వాలకు చెందిన ఓ కట్టెల వ్యాపారి కేటీదొడ్డి మండలంలో అక్రమంగా కట్టెలు కొట్టి ట్రాక్టర్‌లో తరలిస్తుండగా గురువారం ఫారెస్ట్ బీట్ ఆఫీసర్లు గుర్తించి పట్టుకున్నారు. కట్టెల రవాణాకు సంబంధించి అనుమతులపై ఆరా తీయగా, ఏమీ లేవని డ్రైవర్ చెప్పడంతో ట్రాక్టర్‌ను గద్వాల అటవీశాఖ కార్యాలయానికి తరలించారు. నిబంధనలకు విరుద్ధంగా కలప తరలిస్తున్నారని డ్రైవర్, ట్రాక్టర్ యజమానిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

కేటీఆర్‌పై కక్ష పూరితంగా కేసు

గద్వాల: కక్ష సాధింపు చర్యలో బాగంగానే బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమంగా కేసు నమోదు చేశారని ఆపార్టీ నాయకుడు విజయ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. ఈ మేరకు ఆయన ప్రభుత్వ చర్యను ఖండించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని కుట్రలు చేసినా కేటీఆర్‌ను ఏమీ చేయలేరని, అంతిమంగా ఈ ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు.

మాలమహానాడు నాయకుల అరెస్ట్

అయిజ: సుప్రీం కోర్టును తీర్పును వ్యతిరేకిస్తూ మాల మహానాడు నాయకులు చేపట్టిన చలో అసెంబ్లీ కార్యక్రమానికి హాజరు కాకుండా గురువారం మండలంలోని మాల మహానాడు నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో మల్లికార్జున్, సురేష్ కుమార్, వీరేష్, మద్దిలేటి, మల్లేష్, తిరుమలేష్, పరమేశ్, మునిస్వామి ఉన్నారు.

ఉండవెల్లి: మండల కేంద్రంలోని మాల మహానాడు సంఘం నాయకులను ఏఎస్‌ఐ సుబ్బారెడ్డి ముందస్తు అరెస్ట్ చేశారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను ముందస్తు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో ట్రెయినీ ఎస్‌ఐ సతీష్ రెడ్డి, కానిస్టేబుల్ ఖాదర్ బాషా, తదితరులు ఉన్నారు.

పశుగ్రాసం కోసం పరేషాన్


ఎర్రవల్లిలో వరి పంటను కోస్తున్న హార్వెస్టర్ యంత్రం

- వరికోతల్లో పెరిగిన యంత్రాల వినియోగం
- గడ్డి ముక్కలవ్వడంతో నిల్వ చేసేందుకు ఇబ్బందులు
- ట్రాక్టర్ వరిగడ్డి రూ.13 నుంచి రూ.15 వేలు
- నియోజకవర్గంలో మొత్తం 1,08,422 పశువులు
- పశువులకు మేతలేక రైతుల అవస్థలు


యంత్రము కోయడంతో ముక్కలుగా మారిన వరిగడ్డి

ఎర్రవల్లి: వరికోత యంత్రాలు అందుబాటులోకి వచ్చాక పశువులకు గడ్డి దొరకని పరిస్థితి నెలకొంది. అలంపూర్ నియోజకవర్గంలో ఖరీఫ్‌లో వరి విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే పెరిగినా వరి గడ్డి మాత్రం దొరకడం లేదు. దీనికి ముఖ్య కారణం వరి కోతలకు కూలీలకు బదులుగా యంత్రాలను ఉపయోగించడమే. యంత్రాల ద్వారా వరిని కోయడం వల్ల గడ్డి మొత్తం ముక్కలుగా రావడంతో కట్టలు కట్టడానికి వీలుకాక రైతులు నిల్వ చేయలేకపోతున్నారు. వరి సాగు చేసిన గ్రామాల్లో కూలీల కొరతతో పాటుగా ఖర్చులు కూడా అధికమవ్వడంతో రైతులు కోతలకు యంత్రాల వినియోగం పెరిగింది. బోరు మోటార్లు, చెరువుల దగ్గర వరిని సాగు చేసిన రైతులు సైతం యంత్రాలతో వరి కోతలు చేపట్టడంతో నష్టం తగ్గి పంట పూర్తిస్థాయిలో చేతికందుతోందని రైతులు భావిస్తున్నారు. దీనివల్ల పశువులకు మాత్రం వరి గడ్డి దొరకడం లేదు. పశుగ్రాసం కొరత వల్ల గడ్డిని సాగుచేసిన రైతులే నిల్వ ఉంచుకునేందుకు సిద్ధం అవుతున్నారు. దీంతో నీటి వనరులు లేని రైతులు పశుగ్రాసం కోసం అవస్థలు పడుతున్నారు.

నియోజకవర్గంలోని పాడి పశువుల వివరాలు..	
పశువులు	56,298
గేదెలు	52,124
మొత్తం పశువులు	1,08,422

గడ్డి ఎక్కువగా నిల్వ ఉండాలంటే..

యంత్రాలతో గడ్డిని కోసిన తర్వాత కొద్దిపాటి జాగ్రత్తలను తీసుకుంటే ఏడాదిపాటు గడ్డి సులభంగా నిల్వ ఉంటుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. పొలంలో యంత్రం ద్వారా కోసిన గడ్డిని పనలుగా సేకరించి ఒక్కో పనను గట్టిగా కట్టాలి. అనంతరం ఆ పనలను ఒక ప్రాంతానికి చేర్చి గడ్డిమేటు వేయాలని చెబుతున్నారు. గడ్డిమేటు వేసే సమయంలో పైకప్పు ఏటవాలుగా ఉండేలా చేసుకొని పైన టార్పాలిన్ లేదా ప్లాస్టిక్ కవర్లను కప్పి ఉంచాలి. దీనివల్ల వర్షాకాలంలో గడ్డిలోకి నీరు వెళ్లకుండా ఎక్కువ రోజులు గడ్డి నిల్వ ఉంటుందని అధికారులు సూచిస్తున్నారు.

పశువులకు మేత దొరకడంలేదు..



ప్రస్తుత కాలంలో యంత్రాలతో వరి కోతలను చేపట్టడంతో పశువులకు గడ్డి దొరకడం కష్టంగా మారింది. గతంలో కూలీలతో వరికోతలు చేపట్టడం వల్ల గడ్డి ఎక్కువగా దొరికేది. కూలీల ద్వారా కోత కోసిన గడ్డి పూర్తిగా రావడంతో నిల్వ చేసేందుకు వీలుగా సులభంగా ఉండేది. ప్రస్తుతం ఆయకట్టేతర ప్రాంతాలకు పశుగ్రాసం దొరకడం చాలా కష్టంగా మారింది.

– గొల్ల జయసింహ, రైతు, ఎర్రవల్లి

యంత్రాలు కోసిన గడ్డిని పశువులు తినడంలేదు..



కూలీల కొరత వల్ల చాలా మంది రైతులు యంత్రాల ద్వారానే వరి కోతలు కోస్తున్నారు. దీని వల్ల యంత్రాలతో కోసిన గడ్డి చిన్న చిన్న ముక్కలుగా రావడంతో నిల్వ చేయడానికి పనికి రాకుండా పోతుంది. పశువులు కూడా యంత్రాలతో కోసిన గడ్డిని సక్రమంగా తినడం లేదు. కోత కోసిన ట్రాక్టర్ గడ్డి సుమారు రూ.15 వేల వరకు పలుకుతుంది. దీని వల్ల పశువులను పోషించడానికి చాలా ఇబ్బందులు పడాల్సి వస్తోంది.

– కుర్వ వీరన్న, రైతు, షేకుపల్లి


కొండేరులో వరిపంటను కోస్తూ గడ్డిని ముక్కలు చేస్తున్న యంత్రం

మంత్రి పదవి నుంచి తొలగించాలి


అలంపూర్‌లో నిరసన వ్యక్తం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు


ఇటిక్యాలలో నిరసన వ్యక్తం చేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పై అవమానకరమైన వ్యాఖ్యలు చేసిన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కేంద్ర క్యాబినెట్ నుంచి తొలగించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో అంబేడ్కర్ విగ్రహం వద్ద కేవీపీఎస్ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి వ్యాఖ్యలపై గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యసభలో కేంద్ర హోం మంత్రి అమిత్‌షా డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై చేసిన వ్యాఖ్యలపై ప్రజలకు బహిరంగ క్షమాపణ చెప్పాలన్నారు. రాజ్యాంగా నిర్మాతను అపహస్యం చేయడానికి అమిత్ షా ప్రయత్నించారని ఆరోపించారు. అవమానకరమైన వ్యాఖ్యలకు బాధ్యత వహిస్తూ హోం మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వెంకటస్వామి, కేవీపీఎస్ నాయకులు అయ్యప్ప, మౌలాలి, రైతు సంఘం నాయకులు నరసింహ, గంగన్న, జయన్న, చిన్న రాయుడు ఉన్నారు.

అమిత్ షాను బర్తరఫ్ చేయాలి

ఎర్రవల్లి: పార్లమెంట్‌లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానపర్చిన కేంద్ర హోంమంత్రి అమిత్‌షాను వెంటనే మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు అన్నారు. ఇటిక్యాల మండల కేంద్రంలో అంబేడ్కర్ విగ్రహం దగ్గర మహనీయుల చిత్రపటాలతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చాయ్ అమ్మే వ్యక్తిని సైతం ప్రధానిని చేసిన ఘనత అంబేడ్కర్‌కు ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో నాయకులు మోహన్, రాజు, స్వామిదాసు, తిమోతి, ఇర్మియా, రమేష్, ఏసన్న ఉన్నారు.

అమిత్‌షాను బీజేపీ నుంచి తొలగించాలి

అయిజ: కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాను వెంటనే అరెస్ట్ చేసి బీజేపీ నుంచి తొలగించాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ పల్లయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడారు. అంబేడ్కర్‌పై పార్లమెంట్‌లో అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో రమేష్ బాబు, వీరేష్, మైబు, రంగన్న ఉన్నారు.

వరద బాధితులకు న్యాయం చేయండి


అలంపూర్‌లో తహసీల్దార్‌కు సమస్యను వివరిస్తున్న నాయకులు

అలంపూర్: వరదల్లో సర్వం కోల్పోయి దుర్భరమైన జీవితం గడుపుతున్న దళితులకు న్యాయం చేయాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రెడ్డిపోగు ప్రేమదాసు, సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు రాజు, రేపల్లె దేవదాసులు డిమాండ్ చేశారు. అలంపూర్ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద వరదల్లో నష్టపోయిన సంత మార్కెట్ కాలనీకి చెందిన దళిత కుటుంబాలు గురువారం ధర్నా చేపట్టాయి. సంత మార్కెట్ కాలనీ నుంచి తహసీల్దార్ కార్యాలయ వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించి న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా సీపీఎం, టీఎస్ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడారు. 2009 అక్టోబర్ 2వ తేదీన వచ్చిన వరదల్లో సంత మార్కెట్ కాలనీ ప్రజలు సర్వం కోల్పోయినట్లు తెలిపారు. ఇక్కడ ఉన్న 150 దళిత కుటుంబాలకు ఇప్పటికి కనీసం ఇండ్ల స్థలాలు ఇవ్వలేదన్నారు. వరద బాధితుల కోసం సేకరించిన 43 ఎకరాల స్థలంలో దళితులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. వచ్చే ఏడాది జనవరి 5 లోపు ఇండ్ల స్థలాలు కేటాయించకపోతే తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరవధిక నిరాహార దీక్షలు చేపడతామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ మంజులకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు వెంకటస్వామి, నరసింహ, అయ్యప్ప, మౌలాలి, గంగన్న, కాలనీ వాసులు నయోమి, ఫక్కీరమ్మ, రుతమ్మ, రవణమ్మ, అబ్రహం, ఏసేపు, సత్యం, రాజు, మద్దిలేటి, శేషమ్మ, నరసింహ, అయ్యప్ప, మౌలాలి, గంగన్న తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే


జడదొడ్డిలో సర్వే చేస్తున్న మండల వ్యవసాయ అధికారి జనార్దన్

అయిజ: ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వే కొనసాగుతోంది. దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించే కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నారు. గురువారం మున్సిపాలిటీలో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల సర్వేలో అధికారులు నిమగ్నమయ్యారు. మున్సిపాలిటీలో ఇన్‌చార్జి మున్సిపల్ కమిషనర్ రాజయ్య, మండలంలో ఎంపీడీఓ వెంకటయ్య ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను గుర్తించే సర్వే కార్యక్రమం కొనసాగుతోంది. జడదొడ్డి గ్రామంలో ప్రత్యేక అధికారి జనార్దన్ సర్వే నిర్వహించారు. మున్సిపాలిటీలో వార్డు ఆఫీసర్లు, మండలంలో గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎర్రవల్లి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఇటిక్యాల తహసీల్దార్ నరేందర్ అన్నారు. మండలంలోని గోపల్‌దిన్నె, మొగిలి రావులచెర్వు గ్రామాల్లో అధికారులు ఇందిరమ్మ ఇళ్ల సర్వేను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో సంబంధిత యాప్‌లో నమోదు చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. దరఖాస్తు దారుల ఇండ్లను సందర్శించి వివరాలను అడిగి తెలుసుకొని ఆన్‌లైన్ యాప్‌లో నమోదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల దరఖాస్తుదారుల వివరాలను పక్కాగా సేకరించి వాస్తవ పరిస్థితులతో పాటు ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా యాప్‌లో వివరాలను అప్లోడ్ చేయాలని ఆయన అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల కార్యదర్శులు, లబ్ధిదారులు ఉన్నారు.

పంచాయతీ కార్మికుల నిరసన


ధరూరులో వైఎస్సార్ చౌరస్తా వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న పంచాయతీ కార్మికులు

ధరూరు: ఇందిరా పార్కు వద్ద చేపట్టనున్న పంచాయతీ కార్మికుల ధర్నాను భగ్నం చేసేందుకు పంచాయతీ కార్మికులను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ గురువారం మండల పంచాయతీ కార్మికులు నిరసన వ్యక్తం చేశారు. స్థానిక వైఎస్సార్ చౌరస్తా వద్ద తెలంగాణ గ్రామ పంచాయతీ ఉద్యోగ, కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ టీయూసీఐ జిల్లా అధ్యక్షులు చింతరేవుల క్రిష్ణ మాట్లాడారు. గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని, జీఓ 51ని రద్దు చేయాలని, కార్మికులకు 10లక్షల ఇన్సురెన్స్ ఇవ్వాలన్నారు. ప్రతి కార్మికుడికి ఉద్యోగ భద్రతతో పాటు ప్రతి నెల 1న వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి చంద్రాములు, సహాయ కార్యదర్శి రంగన్న, సవారన్న, హనుమంతు, ఎలీషా, శ్రీను, బతుకన్న, మహేష్, మహేశ్వరి, రంగమ్మ, లాలు ప్రకాష్, బాబు పాల్గొన్నారు.

ఘనంగా సందెపురాళ్ల పోటీలు


సందెపురాళ్లను ఎత్తుతున్న ఔత్సాహికులు

మల్దకల్: మండల కేంద్రంలో జాతరను పురస్కరించుకుని గురువారం సందెపురాళ్ల పోటీలను నిర్వహించారు. ఈ పోటీలను బీఆర్‌ఎస్ నాయకులు హన్మంతు నాయుడు ప్రారంభించారు. ఈ సందెరాళ్ల పోటీలకు ఉమ్మడి జిల్లాతో పాటు కర్ణాటక నుంచి పెద్దసంఖ్యలో ఔత్సాహికులు పాల్గొన్నారు. 70కేజీల నుంచి 120కేజీల వరకు ఏర్పాటు చేసిన ఈ సందెపురాళ్ల పోటీలలో నారాయణపేట జిల్లా గుడెబల్లూరుకు చెందిన సూరి 115కేజీల బరువును ఎత్తి మొదటి విజేతగా నిలిచారు. మొదటి బహుమతి రూ.12వేలు హన్మంతునాయుడు అందజేశారు. కర్ణాటకలోని నాగన్‌దొడ్డి ప్రతాప్ 110కేజీల బరువు ఎత్తడంతో రూ.8వేలు గంగన్న, సిద్ధి నర్సింహులు అందజేశారు. నిజాం పహిల్వాన్ 110కేజీల బరువును ఎత్తగా, రూ.6వేలు నర్సన్న, జయమ్మలు అందజేశారు. మేడికొండ రాజు, గట్టు అంజిలు 105కేజీల బరువు ఎత్తగా రూ.2500ల చొప్పున పెద్ద మల్లన్న అందజేశారు. బీఆర్‌ఎస్ నాయకులు మోనేష్, రాజు, నరేష్, గోవిందు, బుచ్చన్న, తాయన్న, నాగరాజు, వీరేష్ పాల్గొన్నారు.

స్కావెంజర్లకు నూతన దుస్తుల పంపిణీ

అయిజ: క్రిస్మస్ పండుగ సందర్భంగా పట్టణంలోని సంతబజార్ కాలనీలో ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసే పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మమత అదే పాఠశాలలో పనిచేసే స్కావెంజర్లకు, వంటమనుషులకు గురువారం కొత్త దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నూతన దుస్తులు ధరించి క్రిస్మస్ పండుగను ఆనందంగా జరుపుకోవాలని కోరారు. పాఠశాల ఉపాధ్యాయురాలు చిట్టెమ్మ, విద్యార్థులు పాల్గొన్నారు.

సమయపాలన పాటించాలి



కేటీదొడ్డి: విధి నిర్వహణలో సమయపాలన పాటించాలని మండల విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్ రావు ఉపాధ్యాయులకు సూచించారు. మండలంలోని ఎర్సందొడ్డి, చింతలకుంట, కేజీబీవీ పాఠశాలల్లో గురువారం ఎంఈఓ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మోనూ ప్రకారం నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం అందించాలని విద్యార్థుల హాజరు శాతాన్ని పరిశీలించారు. విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

మల్దకల్: ఉపాధ్యాయులందరూ సమయపాలన పాటించాలని ఇన్‌చార్జి ఎంఈఓ సురేష్ ఉపాధ్యాయులకు సూచించారు. గురువారం మండలంలోని విఠలాపురం జెడ్పీహెచ్ఎస్, ప్రాథమిక పాఠశాలలను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. బడిబయట ఉన్న విద్యార్థులను బడిలో చేర్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో హెచ్ఎం, ఉపాధ్యాయులు ఉన్నారు.

నేడు మాచర్లలో వార్షిక గురుపూజ

గట్టు: మండలంలోని మాచర్లలో శ్రీ సద్గురు పూర్ణానందచంద్రశేఖరార్యుల 25వ వార్షిక పాదుక పూజా కార్యక్రమం శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ఆచల గురు మందిర శిష్య బృందం వారు తెలిపారు. ప్రతి ఏటా మాచర్లకు చెందిన ఆచల గురు భక్త బృందం ఆధ్వర్యంలో శ్రీపూర్ణానంద చంద్రశేరార్యుల వార్షిక పాదుక పూజా కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. ఈ ఏడాది కూడా వార్షిక పాదుక పూజా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు శిష్య బృందం తెలిపారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులతో వేదాంత వైజ్ఞానిక మహాసభను నిర్వహిస్తున్నట్లు నిర్వాహణ కమిటీ అధ్యక్షులు మాచర్ల మల్లికార్జున్ తెలిపారు. కార్యక్రమానికి తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలి వస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ఆదిశిలా క్షేత్రంలో బీఆర్‌ఎస్ నాయకుల పూజలు

మల్దకల్: ఆదిశిలా క్షేత్రంలో గురువారం బీఆర్‌ఎస్ పార్టీ నాయకుడు బాసు హన్మంతునాయుడు ప్రత్యేక పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సందెపురాళ్ల పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శేఖర్‌నాయుడు, మోనేష్, రాజు , గంగన్న, మల్దకల్, రాముడు, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు అయిజ విద్యార్థులు


రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

అయిజ: జిల్లా కేంద్రంలో మూడురోజుల పాటు నిర్వహించిన సీఎం కప్ క్రీడల్లో అయిజ మండల విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. గురువారం మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎంఈఓ రాములు, కాంగ్రెస్ నాయకుడు శేక్షావలి ఆచారి అభినందించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడారు. కబడ్డీ పోటీలకు సంబంధించి బాలుర విభాగంలో అజయ్, వీరేష్, ప్రణయ్, బాలికల విభాగంలో కుసుమ, లక్ష్మి, రాజేశ్వరి, ఫర్హానా, ఖోఖో బాలుర విభాగంలో కిరణ్, శివ, అక్షయ్, పవన్, అభి, చరణ్, వినోద్, సచిన్, అశోక్, బాలికల విభాగంలో స్నేహిత, సానియా, కవిత, సరస్వతి, శిరీషలు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై నట్లు తెలిపారు. ఈనెల 30న నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొని విజయం సాధించాలని విద్యార్థులను ఉపాధ్యాయులు కోరారు. కార్యక్రమంలో వివిధ పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పాఠశాలలు తనిఖీ చేసిన ఎంపీడీఓ


జూలెకల్‌లో విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణ

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని జూలెకల్ యూపీఎస్ పాఠశాల, వెంకట్రామనగర్ ప్రాథమిక పాఠశాలను ఎంపీడీఓ రామకృష్ణ గురువారం తనిఖీ చేశారు. పాఠశాలల్లోని ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. జూలెకల్‌లో ఇందిరమ్మ ఇళ్ల మంజూరు కోసం దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి వివరాలు సేకరించారు. ఎంపీడీఓ వెంట పంచాయతీ సెక్రటరీలు ఉన్నారు.

దాతల సహకారంతో పాఠశాలకు దారి


మానవపాడులో పాఠశాలకు మొర్రంతో రోడ్డును నిర్మిస్తున్న పనులు పరిశీలిస్తున్న ఎంఈఓ శివప్రసాద్

మానవపాడు: మండల కేంద్రంలో దాతల సహకారంతో నిర్మిస్తున్న రోడ్లను ఎంఈఓ శివప్రసాద్ పరిశీలించారు. దాతలు ప్రధానోపాధ్యాయులు వెంకటేష్, రిటైర్ ప్రధానోపాధ్యాయురాలు ఈరమ్మ పాఠశాలకు వెళ్లే రోడ్డు సరిగా లేదని రూ. 20,600 వేలతో రెండు టిప్పర్ల మొర్రం వేయించి రోడ్డు మార్గాన్ని నిర్మించారని తెలిపారు. కార్యక్రమంలో రామేశ్వర్‌రెడ్డి, విజయమ్మ, శ్రీలేఖ, అలియా తదితరులు పాల్గొన్నారు.

బాలల హక్కులు కాపాడతామని ప్రతిజ్ఞ

రాజోళి: బాలల హక్కులను పరిరక్షిస్తామని బాలల హక్కుల పరిరక్షణ సమితి సభ్యులు గురువారం ప్రతిజ్ఞ చేశారు. మండల కేంద్రంలో ఎంవీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండల స్థాయి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన, బాల కార్మికులు లేని సమాజ స్థాపన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. దాని కోసం నిస్వార్థంగా పని చేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కమిటీలో ఉన్న ప్రతి సభ్యులు విద్యార్థుల మధ్యాహ్న భోజనం, విద్యార్థుల హాజరు శాతం, ఉపాధ్యాయుల పని దినాలు, వారి సమయ పాలనపై పర్యవేక్షణ చేయాలన్నారు. ఎంఈఓ భగీరథ రెడ్డి, సెక్టోరియల్ అధికారి శాంతరాజు, ఎంవీ ఫౌండేషన్ సభ్యులు హనిమి రెడ్డి, ఏపీపీ మార్తమ్మ, దేవదాసు, బుచ్చమ్మ పాల్గొన్నారు.

